లేదు. శ్రీకృష్ణు డతని గాంభీర్యము, గుండెనిబ్బరము, ఔదార్యము గమనించి లోలోపల ఎంతో మెచ్చుకున్నాడు. ఇటువంటి మహావీరుడు, ధీరుడు, ఉదారుడు, ధార్మికుడు పాండవుల పక్షాన నిలిచి పోరాడితే దిగ్విజయం కరతలామలకం కాగలదని ఉవ్విళ్ళూరిపోయాడు.

కాని ద్రౌపదీదేవి విషయం ఎత్తగానే కర్ణునికి కలిగిన ఆశ్చర్యానికిక అంతులేదు. శ్రీకృష్ణు డీవిధంగా స్వతంత్రించి ద్రౌపదీదేవి విషయం ప్రసంగించడానికి ఆధారం ఏమా అని అతడెంతో మథనపడ్డాడు. ఎంతసేపటికీ అతనికేమీ అవగాహన కాలేదు. మాయావి వాసుదేవు డెంతటికైనా తగినవాడే అనుకొన్నాడు. కాని ఆ భావమేమీ పైకి వెల్లడి కానీయలేదు.

## 2

అంతలో శ్రీకృష్ణుడు అతన్ని మళ్ళీ హెచ్చరించాడు:

"కర్ణా! నేను చెప్పినది జాగ్రత్తగా మననం చేసుకో! నీ హితం కోరి చెబుతున్నాను సుమా!" అని నిశితంగా కర్ణుని విశాల నేత్రాలవైపు చూచాడు. కర్ణు డలాగే నిర్లిప్త దృష్టితో శ్రీకృష్ణునికి సమాధానంఇచ్చాడు:

"నేను సూతకులంలో జన్మించినవాడనని తెలిసినా దుర్యోధన చక్రవర్తి నన్నీసడించి కించపరచలేదు. తన కుమారులకన్నా, తమ్ముల కన్నా నన్నెన్నో మడుగు లెక్కువగా గౌరవించాడు. పైగా నన్నంగ రాజ్యాధిపతిగా అభిషేకించాడు. ఇంతేకాదు. ఇప్పటికైనా నేనే అర్జునుణ్ణి జయించగలనని నామీద కొండంత ఆశ పెట్టుకుని కూర్చున్నాడు. సరీగా ఇలాంటి యుద్ధ ప్రారంభ సమయంలో అతన్ని విడిచిపెట్టి వెళ్ళిపోవడం న్యాయ్యమేనా? నీవే చెప్పు!"

అతని వాగ్ధాటి విని వాసుదేవుడు నిరుత్తరుడైనాడు. ఆ విధంగా సమాధానం చెప్పిన అతని నిక పాండవులతో చేరవలసిందని ఏ విధంగా ప్రోత్సహించగలడు?

తిరిగీ-కర్ణుని ధీరగంభీరవాణి శ్రీకృష్ణుని శ్రుతికుహరంలో మారుమోగింది.

"నేనూ, అర్జునుడూ ఒకరొకరితో పోరాడక తప్పదు. మా యిద్దరి యుద్ధము విధి విహితము. మేమిద్దరము ఒకరొకరి కెదురుగా నిలిచి పోరాడ

